క్లుప్తంగా

ఆర్టీసీ బస్సులు నడపాలి

ఆత్మకూర్: విద్యార్థులకు అనుగుణంగా సమయపాలన పాటిస్తూ ఆర్టీసీ బస్సులను నడిపించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆత్మకూర్ నుంచి సర్వ మండల కేంద్రానికి బస్సులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దాదాపు 20 గ్రామాలకు బస్సుల సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రమేష్, భాను, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

వనపర్తిటౌన్: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సాతర్ల అర్జున్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు నియంత్రణ చట్టం వెంటనే అమలు చేసి అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లో బుక్స్, యూనిఫాంలు అమ్ముతున్న యాజమాన్యాలు, ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలకృష్ణ, జిల్లా ఖేల్ కన్వీనర్ కేదర్‌నాథ్, నాయకులు పాల్గొన్నారు.

బీసీ వసతి గృహాల్లో మెరుగైన వసతులు

వీపనగండ్ల: మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ వసతి గృహంలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు చేరాలని హాస్టల్ వార్డెన్ శివయ్య తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులను ఈ హాస్టల్‌లో చేర్చుకుంటామని, విద్యార్థులకు ఉచిత భోజనంతో పాటు పాఠ్యపుస్తకాలు, కాస్మోటిక్ చార్జీలు అందజేస్తామని తెలిపారు. చిన్నంబావి, వీపనగండ్ల, పాన్‌గల్ మండలాల్లోని విద్యార్థులు ఈ హాస్టల్‌లో చేరేలా ప్రజాప్రతినిధులు చొరువ చూపాలని కోరారు.

కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి స్టేజీ సమీపంలో గల దత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయ 17వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శివలింగానికి పుష్పాభిషేకం, బిల్వాభిషేకం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

వనపర్తి: జిల్లా కేంద్రంలో దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చురాము ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు కలెక్టర్ ఆదర్శ్ సురభికి వినతి పత్రం అందజేశారు. బస్సుల సంఖ్యను పెంచటంతో పాటు బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు, కొత్త రేషన్ కార్డుల జారీ, తిరుమలాయగుట్టను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని, పాలిటెక్నిక్ కళాశాల భవనానికి మరమ్మతులు, చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి రుణసౌకర్యం, డ్రెయినేజీలను శుభ్రం చేయాలని డిమాండ్లను వినతి పత్రంలో పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఆడిట్

పాన్‌గల్: ఎమ్మార్సీ కార్యాలయంలో పాఠశాలల్లో నిధుల వినియోగంపై ఆడిట్ కొనసాగుతుందని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ గురువారం పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2023-24 సంవత్సరంలో వచ్చిన నిధులు, ఖర్చు చేసిన విధానానికి సంబంధించిన అన్ని రకాల బిల్లులు, పూర్తి సమాచారంతో రికార్డులు చూయించి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఆడిట్ చేయించుకోవాలన్నారు. ఇప్పటి వరకు 35 పాఠశాలలకు సంబంధించిన ఆడిట్ పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది శేఖర్‌నాయక్, గోవింద్, మూర్తి పాల్గొన్నారు.

త్రిసభ్య సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

వనపర్తిటౌన్: ప్రభుత్వం గృహ కార్మికుల సంక్షేమం కోసం త్రిసభ్య సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి వారి సమస్యలు పరిష్కరించాలని అడ్వకేట్ జయలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం గృహ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంఎస్‌ఐ జిల్లా కోఆర్డినేటర్ జయభారతి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ.. గృహ కార్మికులకు సమగ్ర చట్టం అమల్లోకి తీసుకురావాలని, రూ.12వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు యాదమ్మ, సత్యమ్మ, పార్వతమ్మ, మద్దమ్మ, గోవిందమ్మ, తార పాల్గొన్నారు.

'నిరాహార దీక్ష చేస్తా'

అమరచింత: పట్టణంలోని నాల్గో వార్డుకు చెందిన కురుమన్న రహదారిని కబ్జా చేసినా.. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని, సమస్యను నిలదీసినందుకు తనపై కేసు పెట్టారని నాలుగో వార్డు కౌన్సిలర్ సింధు తెలిపారు. నాల్గో వార్డు సమస్యలను పరిష్కరించకపోతే బాధ్యత గల కౌన్సిలర్‌గా మున్సిపాలిటీ ఎదుట నిరాహార దీక్ష చేస్తానంటూ గురువారం కౌన్సిలర్ సింధు మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందించారు.



పాన్‌గల్‌లో..



అమరచింతలో..



వెల్టూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో..

విద్యార్థుల ఆరోగ్యమే ముఖ్యం

ఆత్మకూర్: జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆత్మకూర్‌లోని పాఠశాలల్లో విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారి డాక్టర్ శరత్‌కుమార్, ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌ఎంపీపీ కోటేష్ అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, కమిషనర్ నాగరాజు, ఎంపీడీఓ సుజాత, ఎంఈఓ భాస్కర్‌సింగ్, సీహెచ్‌ఓ సురేష్‌కుమార్, హెల్త్‌సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యకరమైన జీవితం పొందే అవకాశం ఉందని తిప్పుడంపల్లి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శరత్ అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను గురువారం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, ఎంఈఓ భాస్కర్ సింగ్, డాక్టర్ రూపశ్రీ, జీహెచ్‌ఎం కరుణాకర్, హెల్త్ సూపర్ వైజర్ సురేందర్ గౌడ్, ఏఎన్‌ఎం రోహేల పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: చిన్న పిల్లల్లో పౌష్టికాహార లోపం, రక్తహీనతకు కారణమయ్యే నులిపురుగుల నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యులు సూచించారు. పెద్దమందడి మండలంలోని వెల్టూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విష్ణు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాస్, చైర్‌పర్సన్ గాయత్రి

పాన్‌గల్: ప్రతి విద్యార్థికి రోగ నిరోధక శక్తిని పెంపొందించి ఎదుగుదల ఉండేందుకే నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు పాన్‌గల్ ఎంపీటీసీ హైమావతి, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ నాగరాజు అన్నారు. మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలతో కలిసి ఆమె పంపిణీ చేశారు. మండలంలో 10,658 మంది విద్యార్థులకు గాను 10,416 మంది విద్యార్థులకు నివారణ మాత్రలు వేసినట్లు వైద్య సిబ్బంది పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు నరేందర్, విజయలక్ష్మి, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వీపనగండ్ల: పసిపిల్లలు నులిపురుగుల బారిన పడకుండా ఆరోగ్యవంతంగా పెరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల వైద్యాధికారి డా.రాజశేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో నులి పురుగుల నివారణ మందులను ఆయన పసిపిల్లలకు వేశారు.

మదనాపురం: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో గురువారం ఎంపీపీ పద్మావతి విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ భవాని, రిటైర్డ్ ఉపాధ్యాయులు రవీందర్ రెడ్డి, ఎస్‌ఓ రేణుక, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ప్రమీల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి, పెబ్బేరు, శ్రీరంగాపురం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం వైద్య బృందాలు విద్యార్థులకు ఆల్బెండజోల్ మందులను పంపిణీ చేశారు. పెబ్బేరు బాలుర పాఠశాలలో మున్సిపల్ చైర్మన్ ఎద్దుల కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, శ్రీరంగాపురం కేజీబీవీ పాఠశాలలో జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్, ఎస్‌ఓ వాణి విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. రంగాపురం పాఠశాలలో ఎంఈఓ జయరాములు విద్యార్థులకు మాత్రలు అందించారు.



పెబ్బేరు బాలుర పాఠశాలలో..



శ్రీరంగాపురం కేజీబీవీలో..

ఖిల్లాఘనపురం: ప్రతి విద్యార్థికి నులిపురుగుల నివారణ మాత్రలు తప్పని సరిగా వేయించాలని జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, ఎంపీడీఓ వెంకటాచారి, మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, ఎంఈఓ ఉషారాణి అన్నారు. మండలవ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో విద్యార్థుల్లో నులి నివారణ మాత్రలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి ప్రశాంతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వీపనగండ్లలో..



మదనాపురంలో..



ఖిల్లాఘనపురం కస్తూర్బాగాంధీ పాఠశాలలో..

సామాజిక సేవలో ముందుండాలి

అమరచింత: అన్ని దానాల కంటే రక్తదానం ఎంతో గొప్పదని, ఆపద సమయాల్లో ఆస్పత్రుల్లో రక్తం అందక చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న వారికి సంజీవనిగా ఉపయోగపడుతుందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా గురువారం పట్టణంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇకపై సామాజిక సేవ కార్యక్రమాల్లో యువకులతో కలిసి నిరుపేదలను ఆదుకోనేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తున్న కేశం.నాగరాజ్‌గౌడ్ తన తండ్రి జ్ఞాపకార్థం కే.శే. కేశంనరసింహులుగౌడ్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరసింహులు, మండల, పట్టణ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, పోసిరిగారి విష్ణు, శ్యాం, తౌఫిక్, అసు, హనుమంతునాయక్, విజయ్, నాగునాయక్, రమేష్ నాయక్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, నాగరాజ్‌గౌడ్

రోగులకు పండ్లు పంపిణీ

ఆత్మకూర్: టీపీసీసీ అధికార ప్రతినిధి, రాష్ట్రగీత కార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ జన్మదినం సందర్భంగా ఆత్మకూర్‌లోని సాయిబాబ మందిరం వద్ద భక్తులకు అన్నదానం, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో రహ్మతుల్లా, తులసీరాజ్‌యాదవ్, పరమేష్, నల్గొండ శ్రీను, నాగేష్, గంగ, బంగారు భాస్కర్, మచ్చేందర్‌గౌడ్, షంశీర్, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, దస్తగిరి, రఫీఖ్, రమేష్, మణివర్ధన్‌రెడ్డి, దాము, మహేష్ తదితరులు ఉన్నారు.

'నీట్'పై సీబీఐ విచారణ జరిపించండి

అమరచింత: నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీకేజీపై సీబీఐతో విచారణ జరిపించాలని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా నాయకుడు వెంకటేష్ మాట్లాడుతూ 2024 మే లో నిర్వహించిన నీట్ పేపర్ లీక్ అయ్యినందున 20 లక్షల మంది విద్యార్థుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీహార్‌లోని పాట్నాలో ఓ పరీక్ష కేంద్రంలో 16 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 16 మందికి మొత్తానికి 720 మార్కులు రావడంపై విస్మయం చెందారు. రాష్ట్రంలో ఉన్న బీజేపీ నేతలు ఫోన్ టాపింగ్ వ్యవహారంలో సీబీఐ విచారణకు పట్టుబడుతున్నారే తప్ప దేశవ్యాప్తంగా లక్షల మంది జీవితాలను నాశనం చేసే నీట్ అవినీతిలపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా పరీక్ష రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో అజయ్, బుచ్చన్న, శ్రీనివాసులు, విష్ణు, ప్రకాష్, మహిమూద్, రాజశేఖర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

పెండింగ్ క్లెయిమ్ నిధులు విడుదల చేయాలి



వనపర్తి కార్మికశాఖ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

పెబ్బేరు రూరల్: వెల్ఫేరు బోర్డులో నిధులు ఉన్నా.. భవన నిర్మాణ కార్మికులకు ఇవాల్సిన పెండింగ్ క్లెయిమ్ నిధులను విడుదల చేయడంలో కార్మిక శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పుట్ట ఆంజనేయులు ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలో తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ ఫెడరేషన్ సీఐటీయూ జిల్లా కమిటీ అధ్యక్షుడు గంధం మదన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లెయిమ్ నిధులు విడుదల చేయాలని కార్మికులతో కలిసి జిల్లా కార్మిక శాఖ అధికారి కార్యాలయంలో ఏఎల్‌ఓ వెంకటేశ్వర్లకు వినతి పత్రం అందించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డులో రూ. 3,700 కోట్లు జమ అయ్యావని, రాష్ట్ర వ్యాప్తంగా 54వేల క్లెయిమ్స్ పెండింగ్‌లో ఉండగా.. వనపర్తి జిల్లాలో 2019 నుంచి 2024 వరకు 2000 పెండింగ్ క్లెయిమ్స్ ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, కురుమన్న, పుల్లయ్య, గోవిందు, మంద మన్యం, నరసింహ, పరమేష్, రాములు, ఆంజనేయులు పాల్గొన్నారు.

కొలిక్కి రాని గ్రాట్యుటీ సమస్య

అమరచింత: గ్రాట్యుటీ పెంపు విషయమై బీడీ ఫ్యాక్టరీల యాజమాన్యంతో గురువారం హైదరాబాద్‌లో కార్మిక సంఘాల నాయకులు జరిపిన చర్చలు మరోమారు వాయిదా పడ్డాయి. పూర్తిస్థాయిలో యాజమాన్యాలు హాజరుకాకపోవడంతో వాయిదా పడ్డాయని కార్మిక సంఘం నాయకులు తెలిపారు. అదేవిధంగా వంద బీడీలపై రూ.4 జరిమానా ఉందని.. వీటిని పెంచాలనే ఆలోచనను యాజమాన్యాలు విరమించుకోవాలని కోరారు. సమావేశంలో బీడీ ఫ్యాక్టరీల యజమానులు సోహెల్, జియా, వసీం, ఫజల్, బీడీ కార్మిక సంఘాల నుంచి ఇష్టా రాష్ట్ర ప్రధానకార్యదర్శి సూర్యం, దేవదానం, కోళ్ల వెంకటేష్, ఖలీల్ సీఐటీయూ నుంచి వేణు, రమేష్, బీఆర్‌ఎస్ కార్మిక సంఘం నుంచి అబ్రహం, ఏఐటీయూసీ నుంచి శ్యాంసుందర్ పాల్గొన్నారు.

'ప్రభుత్వ భూములను కాపాడండి'

కొత్తకోట: కబ్జా కోరల్లో ఉన్న ప్రభుత్వ భూములను అధికారులు కాపాడాలంటూ భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకుడు కొమ్ము భరత్ భూషన్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు విశ్వేశ్వర్ అధికార బలంతో కొత్తకోట పట్టణంలోని 362 సర్వే నంబరులో 1.17 గుంటల భూమిలో గల ప్రభుత్వ ఆస్పత్రిని కూల్చి సొంతంగా షాపింగ్ కాంప్లెక్స్, నివాస గృహాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పట్టణంలోని కోదండరామ స్వామి ఆలయం ఎదురుగా గల రాజులు నిర్మించిన సత్రాలను కూడా కబ్జా చేసుకొని పాత ఇనుప సామానులు కొనుగోలు చేసే వ్యాపారులకు అద్దెకు ఇచ్చి లబ్ధి పొందుతున్నారని దుయ్యబట్టారు. దీంతో పాటు అదే ఆలయానికి సంబంధించిన కోనేరును కూడా కబ్జా చేసి మట్టితో పూడ్చివేసి సొంతం చేసుకునే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఈ కబ్జాలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని ఆయన కోరారు.

నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టాలి

వనపర్తి టౌన్: దళారులు నకిలీ విత్తనాలను రైతులకు అమ్మకుండా ప్రభుత్వం అరికట్టాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తృణధాన్యాలు, ఎరువులు, కల్తీ లేని నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. జిల్లాలోని పోడు భూములను సాగు చేస్తున్న రైతులు అధికంగా ఉన్నారని, దాదాపు 70 ఏళ్లకు పైగా సాగు చేస్తున్నప్పటికీ హక్కు పత్రాలు ఇవ్వడం లేదని వాపోయారు. 2006 అటవీ హక్కుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేసిన ప్రభుత్వం హక్కు పత్రాలను అందజేయాలన్నారు. రూ. 2లక్షల రుణమాఫీ చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలన్నారు. కార్యక్రమంలో కవి జనజ్వాల, దివ్యాంగుల కార్యదర్శి కుశకుమార్, స్వేచ్ఛ జేఏసీ రాష్ట్ర కోకన్వీనర్ ఆదం రాజు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

వనపర్తిటౌన్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని గురువారం జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థినులతో ఉపాధ్యాయురాలు పద్మ సూర్య నమస్కారాలు చేయించారు.



కొత్తకోట: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని ప్రముఖులు, యోగా ప్రియులు అందరూ భారతీయ యోగా విశిష్టతను తెలియజేసేలా తరలిరావాలని విశిష్ట అతిథి శివానందచార్యులు విజ్ఞప్తి చేశారు. పట్టణ కేంద్రంలోని అన్ని వాకింగ్ క్లబ్ సభ్యులు ఉదయం 5గంటల 30నిమిషాలకు శివగార్డెన్ వద్దకు రావాలని కోరారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో వరల్డ్ యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సభ్యుడు దీర్ఘాయువు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 6 నుంచి 8 గంటల సమయంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శివప్రసాద్

కొత్తకోట రూరల్: రోజు రోజుకూ పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెద్దమందడి ఎస్‌ఐ శివప్రసాద్ అన్నారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ వారి ఆధ్వర్యంలో గురువారం పెద్దమందడి ఎంపీపీ రఘుప్రసాద్ అధ్యక్షతన మండల కేంద్రంలోని రైతువేదికలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శివప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆర్థిక అక్షరాస్యత, మొబైల్ వినియోగంపై అవగాహన కలిగి ఉండి ఆన్‌లైన్ మోసాల నుంచి రక్షించుకోవాలని సూచించారు. బ్యాంకు ఉత్పత్తులను, బ్యాంకింగ్ సేవలను తెలివిగా వాడుకోవాలన్నారు. సెల్‌ఫోన్‌కు వచ్చే ప్రతి మెసేజ్‌కు రిప్లై ఇవ్వొద్దని, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి మీ ఆధార్, పాన్‌కార్డు, ఏటీఎం కార్డుల వివరాలు, సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీ అడిగితే చెప్పవద్దన్నారు. అనంతరం వర్క్‌షాప్ ట్రైనర్లు ఎం.విజయ్‌కుమార్, ఎస్.శశికళ మాట్లాడుతూ డిపాజిటర్లు అభద్రతల తొలగింపు, బ్యాంకు వైపు మొదటి అడుగు, డిపాజిట్లు, ఖాతాల గురించి తెలుసుకోవడం లావాదేవీలు నిర్వహించడం, ఖాతాలతో అదనపు ప్రయోజనాలు, ఫిర్యాదుల పరిష్కారం, భారతదేశంలో చెల్లింపు, పరిష్కార వ్యవస్థ, వయోవృద్ధులకు బ్యాంకింగ్ సౌకర్యంపై వివరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ ఆంజనేయులు, మేనేజర్ అశోక్, మండల వ్యవసాయ అధికారి సైదులుయాదవ్, ఎంపీడీఓ సద్గుణ, ఏఈఓలు కృష్ణ, జయప్రకాష్, పంచాయితీ కార్యదర్శి కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొళాయిల సర్వే త్వరగా పూర్తిచేయాలి



గోపాల్‌పేట పర్యటిస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి



పాన్‌గల్‌లో సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

గోపాల్‌పేట: మిషన్ భగీరథ పథకంలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వే పూర్తి చేసి శనివారం సాయంత్రం వరకు నివేదిక పంపించాలని మండల అధికారులను కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం ఆయన గోపాల్‌పేట మండల కేంద్రంలో పర్యటించారు. మండల కేంద్రంలోని అయోధ్య నగర్ కాలనీలో రెండు ఇళ్లను సందర్శించి మిషన్ భగీరథ నల్లా ఎప్పుడెప్పుడు వస్తుందని ఆరా తీయగా.. ఓ ఇంటి వద్ద అసలు నల్లా నుంచి నీరే రావడం లేదని, ఇంకో ఇంటి వారు నెలరోజులు దాటిన తాగునీటి సరఫరా లేదని సమాధానం ఇచ్చారు. దీనిపై అధికారులను ప్రశ్నించగా.. తరచుగా బోరుమోటార్లు రిపేరు కావడంతో కొన్నిసార్లు రావడం లేదని సమాధానమిచ్చారు. అనంతరం మండల కేంద్రంలోని అమ్మ ఆదర్శ పాఠశాలను సందర్శించారు. అనంతరం గోపాల్‌పేట, వనపర్తి వైద్యశాలలను సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ యాదయ్య, డీఎల్‌పీఓ రఘునాథ్‌రెడ్డి, టీఎస్‌డబ్ల్యూఐడీసీ ఇంజినీర్ శ్రీనివాస్, స్థానిక అధికారులు ఉన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ ఇంటింటి సర్వేను గురువారం డీఎల్‌పీఓ రఘునాథ్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి నల్లా ఉందా.. నీటి సరఫరా ఏవిధంగా అవుతుందని ఆరా తీశారు. సర్వే వివరాలను పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ రఘురాములు, పంచాయతీ కార్యదర్శి రఘు పాల్గొన్నారు.